క్లుప్తంగా

వరి కొయ్యల వినియోగంపై అవగాహన



రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రస్తుతం ఆయా గ్రామాల్లో రైతులు వరిధాన్యం పండించిన తర్వాత వరి కొయ్యలను ఎక్కువగా కాల్చివేస్తున్నారు. దీంతో కలిగే లాభనష్టాలపై మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శివాయపల్లి రైతువేదిక వద్ద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ నిపుణులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి ధాన్యం కోయగా, మిగిలిన కొయ్యలను కాల్చివేయడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. రైతులు వరికొయ్యలను కుళ్లింపచేయడంతో పాటు దానికి అందులోనే కలియదున్నడం వల్ల భూసారం పెరగడంతో పాటు పంటల దిగుబడి పెరుగుతుందని, రైతులు పంట మార్పిడి తప్పకుండా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, వినీత్, అఖిల్‌హుస్సేన్ ఉన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సంఘం చైర్మన్ చంద్రం

రామాయంపేట(మెదక్): మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన బాజ కవితకు గొర్రెల పెంపకానికి సంబంధించి సహకార సంఘం నుంచి రూ. 5,59,500 రుణం మంజూరైంది. ఈ మేరకు సంఘం చైర్మన్ చంద్రం మంగళవారం ఆమెకు చెక్కు అందజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింధూరేణుక

హవేళిఘణాపూర్(మెదక్): పుస్తకాలను చదవడం ద్వారా సమాజంలో ఉన్న అన్ని అంశాలపై అవగాహన పెరిగి మంచి జ్ఞానం పెరుగుతుందని తహసీల్దార్ సింధూరేణుక అన్నారు. మంగళవారం మండల కేంద్రం హవేళిఘణాపూర్ ఎంజేపీ బాలుర పాఠశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ప్రదర్శనలో ఉంచిన పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో మధుమోహన్, పాఠశాల ప్రిన్సిపాల్, బోధన సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీరప్ప జాతరకు 'జోగు'



పాపన్నపేట(మెదక్): బీరప్ప జాతర కోసం రామతీర్థం గ్రామంలో మంగళవారం జోగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో త్వరలో జరుగనున్న బీరప్ప జాతర సమాయత్త కార్యక్రమంలో భాగంగా గ్రామ కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప పూజారులు, కురుమ కులస్తులు ఇళ్లు తిరుగుతూ జోగు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ధాన్యం సమర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు సాయిలు, మల్లేశం, సాయిలు, హన్మంతు, బాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకుడిగా భరత్

రామాయంపేట(మెదక్): ఆయుష్ శాఖ యోగా శిక్షకుడిగా రామాయంపేటకు చెందిన మద్దెల భరత్ నియమితులయ్యారు. రామాయంపేటలో ఉన్న ఆయుర్వేద వైద్యశాలలో ఆయన యోగా శిక్షకుడిగా పనిచేస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీరోజు ఉదయం యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. తూప్రాన్ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యురాలు శ్రీవిద్య చేతుల మీదుగా మంగళవారం భరత్ నియామకపత్రం అందుకున్నారు.



నియామకపత్రం అందుకుంటున్న భరత్

రైతులు ఆందోళన చెందొద్దు

తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): దండుపల్లి వద్ద రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు ఆందోళన చెందొద్దని, కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని దండుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. రైతులు తాము పండించిన సన్నరకం వడ్లను క్వింటాల్‌కు రూ. 2820 కొనుగోలు చేస్తున్నామని రైతులు అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఇప్పటి వరకు 450 క్వింటాళ్ల సన్నరకం వడ్లను కొనుగోలు చేశామన్నారు. తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఏఈఓ నరేందర్, ఆర్ఐ దీక్షిత్, రమేశ్, మాజీ సర్పంచ్ ఐలయ్య యాదవ్, రైతులు పాల్గొన్నారు.

నార్సింగి రైస్‌మిల్లు తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని రైస్‌మిల్లులను ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ తనిఖీ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మనుమాన్, న్యూ తిరుమల, తిరుమల రైస్ మిల్లులను ఎస్ఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే లారీల నుంచి ధాన్యం దింపుకొని లారీలను తిరిగి పంపించాలని రైస్‌మిల్ యజమానులకు సూచించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గ్రేస్‌బాయి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని పరిశీలించి, ఆమె మాట్లాడారు. రైతులు ఆందోళన చెందొద్దని ప్రభుత్వం ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌కు సూచించారు.



కౌడిపల్లి(నర్సాపూర్): కొనుగోలు కేంద్రంలో వరిధాన్యాన్ని పరీక్షిస్తున్న ఏఓ స్వప్న



పెద్దశంకరంపేట(మెదక్): ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయి

మహమ్మద్‌నగర్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): సన్నరకం వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏఓ స్వప్న నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని మహమ్మద్‌నగర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి బీపీటీ, ఆర్ఎన్ఆర్ తదితర సన్నరకం వరిధాన్యం గింజలను పరీక్షించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సన్నరకం ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యంలో పొల్లు, మట్టిపెడ్డలు, ఇతర వ్యర్థాలు లేకుండా జల్లెడ పట్టాలని సూచించారు. కాగా తూప్రాన్‌లోని సాయిబాలాజీ రైస్‌మిల్‌కు బీపీటీ ఇతర సన్నరకం వరిధాన్యం పంపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్, వెంకట్‌రెడ్డి, యాదుల్, బాలాగడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో కొలువైన శివలింగం



మాల ధరించిన శివస్వాములు

నేడు భద్రకాళి వీరభద్రుడి కల్యాణం

శివనామస్మరణతో మారుమోగనున్న గోకర్ణేశ్వర ఆలయం

రేగోడ్(మెదక్): ఓం నమశ్శివాయ.. హరహర మహాదేవ శంభోశంకర.. నిత్యం శివనామస్మరణ.. శివదీక్షతోనే తమ కోర్కెలు తీరుతాయని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. సుమారు ఇరవైమూడేళ్లుగా శివదీక్షలు తీసుకొని యువకులకు స్ఫూర్తిగా ఉంటున్నారు శివగురుస్వాములు. నేడు బుధవారం భద్రకాళి వీరభద్రుడు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

వెల్లివిరిస్తున్న ఆధ్యాత్మికం

జిల్లాలోని రేగోడ్ మండల కేంద్రంలో గోకర్ణేశ్వర శివాలయం ఆధ్యాత్మికతకు నిలయం. ఈ ఆలయం ప్రస్తుతం ఆధ్యాత్మికత.. ప్రశాంతతకు పేరుగాంచింది. ప్రతీ కార్తీకమాసంలో 40 నుంచి 50 మంది భక్తులు శివమాల, మరికొంత మంది గురుస్వామి విఠల్ మహరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాల వేసుకుంటున్నారు. దీంతో గోకర్ణేశ్వర ఆలయం శివనామస్మరణలతో రోజూ కిటకిటలాడుతోంది.

శ్రీశైలంలో మాల విరమణ

శివదీక్ష మాల ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో 40 రోజుల తర్వాత శ్రీశైలం దర్శించి మల్లికార్జున స్వామికి పూజలు చేసి దీక్షను విరమింపజేస్తారు.

గోకర్ణేశ్వర శివాలయంలో నేడు బుధవారం ఉదయం 11 గంటలకు వేదపండితులు భద్రకాళి వీరభద్రుడి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

శివుడి ఆశీస్సులతో..



శివుడి ఆశీస్సులతో, దేవుడిపై భారం వేసి భక్తులందరూ శివ మాల ధరించారు. రోజూ చల్లటి నీళ్లతో స్నానం, ఒక్కపూట భోజనం, రేకుల కింద పడుకున్నా.. అందరూ ఆరోగ్యంగా ఉంటున్నాం అంటే ఆ శివుడి ఆశీస్సులతోనే.

– శంకర్, శివ గురుస్వామి

కోర్కెలు తీర్చే శివాలయం



శివాలయంలో శివలింగం, హనుమాండ్లు కోరిన కోర్కెలు తీర్చడంతో రోజూ భక్తులతో ఆలయం కిటకిటలాడుతోంది. పూజలు, అన్నప్రసాదం సమర్పణతో భక్తుల రాక పెరిగింది. దాతల సహకారంతో ఆలయం క్రమంగా అభివృద్ధి చెందింది.

– మహేశ్, అర్చకుడు

సమస్యల పరిష్కారానికే ఫిర్యాదుల బాక్స్

కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేశ్

పాపన్నపేట(మెదక్): రైతు సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ చైర్మన్ రమేశ్ తెలిపారు. 71వ సహకార సంఘ వారోత్సవాల సందర్భంగా మంగళవారం సొసైటీ మాజీ ఎండీలు, జిల్లా కోఆపరేటివ్ అధికారులు, రిటైర్డ్ సొసైటీ ఉద్యోగులు తదితరులతో కలిసి ఆయన సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధికారుల అనుభవసారమే తమ సొసైటీ అభివృద్ధికి సోపానం అవుతుందనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక నుంచి సొసైటీ కార్యాలయంలో రైతు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి 15 రోజులకోసారి ఇద్దరు డైరెక్టర్లు, సొసైటీ అధికారుల సమక్షంలో తెరుస్తామన్నారు. సొసైటీ పరిధిలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. సొసైటీ మొదటి ఎండీ ఫణిరాజ మూర్తి, డీసీఓ కరుణ, డీసీఏఓ కరుణాకర్ తదితరులు ప్రసంగించారు. ఇతర ఎండీలు గోపాల్‌రావు, విశ్వనాథం, ఎల్‌పీఎస్ శాస్త్రి, మాధ్యూ, ప్రభాకర్‌రెడ్డి, బాలరాజు, వెంకటేశ్వర్లు సొసైటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన సూచనలు చేశారు. మాజీ ఎండీలు, రిటైర్డ్ ఉద్యోగులు, బ్యాంకు అధికారులను చైర్మన్ సన్మానించారు.



సొసైటీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్లు, అధికారులను సన్మానిస్తున్న చైర్మన్ రమేశ్

మరుగుదొడ్లు ఆత్మ గౌరవాన్ని కాపాడతాయి

నిజాంపేట(మెదక్): మరుగుదొడ్లు మన ఆత్మ గౌరవాన్ని కాపాడతాయని రాంపూర్ పంచాయతీ సెక్రెటరీ చంద్రహాస్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా రాంపూర్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాంపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మారెడ్డి మాట్లాడుతూ.. మరుగుదొడ్లను పరిశుభ్రంగా సుస్థిరంగా ఉపయోగించుకోవాలని సంపూర్ణ స్వచ్ఛతకు మరుగుదొడ్లు క్రియాశీలక పాత్ర వహిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, చంద్రకాంత్, కుమారస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్ఎం పద్మారెడ్డి

ధాన్యం కొనుగోలు ప్రారంభం

– సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ
– 'క్వింటాలుకు 5 కిలోలు బొక్కేస్తుంద్రు' కథనానికి స్పందన



అల్లాదుర్గం(మెదక్): సీతానగర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో అనే శీర్షికతో మంగళవారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతుల ఇబ్బందులను సాక్షి వెలుగులోకి తెచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ మల్లయ్య సీతానగర్ గ్రామానికి వెళ్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఐకేపీ అధికారులతో తహసీల్దార్ మాట్లాడి, హమాలీలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రైతులకు నష్టం జరగదు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ తెలిపారు. మంగళవారం క్వింటాలుకు 5 కిలోలు బొక్కేస్తుంద్రు కథనాన్ని సాక్షి దినపత్రిక ప్రచురించింది. దీనిపై స్పందించిన ఆయన నార్సింగి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వేస్తున్న తూకంపై ఆరాతీశారు. సీఈఓ నర్సింలును వివరణ కోరారు.

పంటల అవశేషాలను కాల్చొద్దు



నర్సాపూర్: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు



నిజాంపేట(మెదక్): నస్కల్‌లో వరి కొయ్యలు కాల్చడంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

నర్సాపూర్: పంటల అవశేషాలను కాల్చొద్దని వ్యవసాయ శాఖ ఏడీఏ సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారి దీపిక రైతులకు సూచించారు. వారు మంగళవారం నర్సాపూర్‌లోని పంట పొలాలు తిరిగి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటల అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణం పాడవుతుందని చెప్పారు. కాల్చకుండా కుళ్లింప చేయడం విధానాన్ని వారు రైతులకు వివరించారు. వారి వెంట ఏఈఓ చంద్రవేణి తదితరులు ఉన్నారు.

నస్కల్‌లో..

నిజాంపేట(మెదక్): మండలంలోని నస్కల్ గ్రామంలో వరి కొయ్యలను పొలంలోనే కాల్చడం వల్ల జరిగే నష్టాలను రైతులకు మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అవగాహన కల్పించారు. ఆయన నస్కల్‌లో వరి కొయ్యలు కాల్చిన పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చడం వలన సేంద్రియ కర్బన శాతం భూమిలో తగ్గిపోతుందన్నారు. అలాగే పంటకు సహకరించే బాక్టీరియా, సూక్ష్మ జీవులు చనిపోవడం వల్ల తెగుళ్లు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో సన్న వరి ధాన్యానికి సంబంధించిన గింజ పొడవు, వెడల్పు ఎంత ఉండాలో రైతులకు వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలత, రాజు, రైతులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం

మెదక్ కలెక్టరేట్: దేశవ్యాప్తంగా 26న జరిగే సమ్మెలో కార్మికులు, రైతులు, వృత్తి సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, వృత్తి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ ..కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కార్మికులు, రైతులు, వృత్తి సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బసవరాజు, యేసయ్య, మల్లేశం, గౌరీ, నాగమణి, రాములు, సత్యం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అధికారులు న్యాయం చేయాలి**

శివ్వంపేట(నర్సాపూర్): వంశపారపర్యంగా సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని మండలంలోని కొత్తపేటకు చెందిన శివరామగౌడ్ వేడుకున్నాడు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామ శివారులో వారసత్వంగా వచ్చిన 4 ఎకరాల 20 గుంటల భూమిని ఇతరులు కాజేయడానికి ఇబ్బందులు గురిచేస్తున్నాడని వాపోయాడు. నర్సాపూర్, జిల్లా, హైకోర్టులను ఆశ్రయించడంతో తనకు అనుకూలంగా తీర్పు వచ్చినా.. న్యాయం జరగడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

◆ **పాఠశాలల పరిశీలన**



హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లి, గుట్టకిందిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను మండల విద్యాధికారి నీలకంఠం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాబోధన, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాన–రు. ఉపాధ్యాయులకు బోధనలో పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతో పాటు విద్యార్థులు బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించేలా పని చేయాలని ఆయన ఆదేశించారు.

◆ **సంస్కృతిక సారధి వెన్నెలను కలిసిన కాంగ్రెస్ నాయకులు**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక సారధి గుమ్మడి వెన్నెల గద్దర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో మోహన్‌నాయక్, రాజ్‌కుమార్, సూరారం నాయకులు ఉన్నారు.

◆ **రోడ్లపై ధాన్యం వేయొద్దు**

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దని ఎస్ఐ నారాయణగౌడ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రహదారులపై తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలకు కారణమైన ధాన్యం వేసిన రైతులపై కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సబైర్‌క్రైమ్‌పై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు. తెలియని వ్యక్తులకు ఎవరు ఓటీపీ చెప్పొద్దన్నారు. అనుమానితులను గమనిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని కోరారు.

◆ **చెక్కుల అందజేత**

నర్సాపూర్: హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని హత్నూర మండలం కొన్యాలకు చెందిన భూదయ్య, మనోహరబాద్‌కు చెందిన శ్రీనివాస్, పోతారంకు శ్రీనివాస్‌లకు చెక్కులు అందజేశారు.

◆ **21న మండల స్థాయి చెకుముకి పరీక్ష**

పాపన్నపేట(మెదక్): జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల 21న చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **నివాళి**

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి, తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాతు సురేశ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తపస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు కృష్ణమూర్తి, సుమతి, వెంకటేశ్, సుమలత, రజనీ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న సమగ్ర సర్వే

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి సర్వే ప్రశాంతంగా కొనసాగుతుందని తహసీల్దార్ ముసాద్దిక్, ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మంగళవారం వారు మండలంలోని పలు గ్రామాల్లో సర్వే విషయమై ఎన్యుమరేటర్ల పనితీరును పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీరోజు వారు చేయాల్సిన సర్వేలను, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించామన్నారు. కుటుంబ సభ్యులు సర్వే చేయాడానికి వచ్చిన ఎన్యుమరేటర్లకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

మండలంలో 6808 కుటుంబాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు 6808 కుటుంబాల సర్వే పూర్తి అయినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల తెలిపారు. మంగళవారం మండలంలోని మహమ్మద్‌నగర్, ధర్మాసాగర్‌గేట్ తండాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేను తప్పులు లేకుండా వేగంగా చేయాలన్నారు. సమస్యలుంటే అధికారులకు తెలియచేయాలని చెప్పారు. సర్వే పత్రాలను జాగ్రత్తగా ఉంచాలని చెప్పారు. సర్వేలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, సిరాజొద్దీన్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): ధర్మాసాగర్‌గేట్ తండాలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ కలీముల్ల



శివ్వంపేట(నర్సాపూర్): నవాబుపేటలో సర్వే చేస్తున్న సిబ్బంది

నిర్దేశించిన విధంగా పూర్తి చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): ఇంటింటి సమగ్ర సర్వేను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్ అన్నారు. మంగళవారం నిర్వహించిన సర్వే తీరుని ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి పరిశీలించారు.

పకడ్బందీగా పూర్తి చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలో పలు గ్రామాలలో సమగ్ర సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం లింగారెడ్డిపేట్ పంచాయతీ కార్యాలయంలో గ్రామానికి చెందిన ఎన్యుమరేటర్లు లక్ష్మి, భవాని, సత్యనారాయణలను సత్కరించి, వారిని అభినందించారు. మండలంలో ఇప్పటి వరకు సర్వే 94 శాతం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సింలు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): లింగారెడ్డిపేట్‌లో ఎన్యుమరేటర్లను సన్మానిస్తున్న ఆర్డీఓ